సె'క్యూ'రిటీ

కాంట్రాక్టర్ కామేశం హుషారుగా ఉన్నాడు. కోటి రూపాయల కాంట్రాక్టు తనకు వచ్చేట్టుగా వెనకా ముందు జాగ్రత్తలన్నీ మాట్లాడుకుని అందర్నీ ఒప్పించాడు. టెండర్ ఫారముతో పాటు ఎర్నెస్ట్ మనీ డి.డి. ఒంటిగంటలోగా ఆఫీసులో సబ్మిట్ చెయ్యాలి. లేకపోతే ఆ కాంట్రాక్ట్ హుష్కాకై పోతుంది.

ఓ అదెంత పనటా ! అనుకుంటూ డబ్బుతో సహా పదకొండు గంటలకే బ్యాంకులో ప్రవేశించాడు. డి.డి. ఫారం నింపి క్యాషు కౌంటర్ వైపు చూశాడు. కౌంటర్ ముందు క్యూ హనుమంతుని తోకలాగుంది. గుండె గుబగుబలాడిందో క్షణం. అయితే ఏం ? ఇలాంటి క్యూలు తానెన్ని చూడలేదూ ! సిన్మాకైనా, దేవాలయములో దర్శనానికైనా క్యూలో నుంచోక చాకచక్యంగా అందర్నీ దాటేస్తూ ముందుకెళ్లడం బాగా అలవాటైంది. ఆ ధీమానే క్యూ పక్కనుండి నడిపించి కౌంటర్ ముందుకు తీసుకెళ్లింది.

"ఏయ్ ! కనబడ్డం లేదా ! క్యూలో రావాలి, వెనకెళ్లవయ్యా !" క్యూలో కౌంటర్ ముందున్నాయన వార్నింగిచ్చాడు.

"సరేగానీ బ్రదర్... !" పలుకరింపు పూర్తికాకముందే ఆయన కేకేసి సెక్యూరిటీ గార్డును పిలిచాడు. పరిస్థితి గమనించిన గార్డు "సార్ ! మీరా క్యూలో నుంచోవాలి" మర్యాదగా వెనక్కు పంపించాడు.

"అమ్మోయ్ ! అలాగైతే ఓ గంటసేపు క్యూలోనే వేళ్లాడాలి" గుండెలు బాదుకున్నాడు.

"అదంతే సార్ ! అదో వాళ్లంతా లేరా !" తుపాకి చూపించాడు.

"నాకర్జంట్ పనుంది బ్రదర్స్ !"

"అంతా అట్లానే అంటారు కానీ... వెనక్కు రండీ" వాదులాటలో అరగంట గడిచింది. హతాశుడైనాడు. సరే... ఒకడుగు వెనక్కువేసి, నాలుగడుగులు ముందు కెయ్యొచ్చు. వ్యూహాత్మకంగా వెనుదిరిగి క్యూ చివరలో నుంచున్నాడు.

"హలో కామేశం ! బాగున్నావా" పాత మిత్రుడు రాజేశం వెనక నుంచుండి భుజం తట్టాడు.

"బాగున్నాను !" వెనుదిరిగి చూశాడు. అతడు గూడా దబ్బు కట్టేందుకే వచ్చాడని చేతిలున్న నిండు హాండు బ్యాగు, డి.డి. ఫారం చెబుతున్నాయి. ఈ క్యూ ఎప్పుడు తగ్గాలి, మనమెప్పుడు క్యాషు కట్టాలి ?" తానే ప్రస్తావించాడు.

"దాందేముందన్నా ! కొంచెం ఓపిక పట్టి క్యూలో నుంచోవాలె. ఈ రోజుల్లో క్యూ లేనిదెక్కడ ? బ్యాంకు, పోస్టాఫీసు, రేషన్‌షాపు అంతెందుకూ ? పబ్లిక్ టాయ్‌లెట్స్ ముందు గూడా" నవ్వేశాడు. కామేశంకు ఒళ్లంతా గాయాలు చేసి కారప్పొడి చల్లినట్లైంది.

"అంతసేపు క్యూలో నుంచోవడం నాకు పడదన్నా !" అంటూ కౌంటర్ ముందు కెళ్లాడు.

పక్కాయనను మాటల్లోకి దింపి క్యూలో చొరబడితే పదినిమిషాల్లో పనైపోతుంది. పెదాల మీదికి చిరునవ్వు రప్పించుకొని "హలో ! మీ ఆఫీసుకీ రోజు సెలవా ?" ఓ విసురు విసిరాడు. పరధ్యానంలో ఉన్న పక్కాయన పలుకలేదు.

"హల్లో !" భుజమ్మీద చెయ్యేసి పలుకరించాడు. ఆయన పరధ్యానం పటా పంచలైంది. "దొంగ... దొంగ..." గట్టిగా అరిచాడు. "పట్టుకోండి ఏయ్ సెక్యూరిటీ" ఇంకోకాయన కేక.

సెక్యూరిటీ గార్డు పరుగెత్తుకొచ్చాడు. గల్లాబట్టి లాగాడు. కాస్సేపు వాదులాట. ఆ తర్వాత మేనేజర్ ముందుకు తీసుకెళ్లి

"సార్ ! ఈ పెద్దమనిషి దొంగతనానికి తయారైండు" విషయం వివరించాడు.

"ఆఁ ! అట్లాగా !" మానేజర్ దిగ్గున లేచాడు. ఏదో గుర్తుకొచ్చినట్టు సెల్ ఫోన్‌తో పక్క గదిలోకెల్లాడు. రెండు మూడు నిమిషాల్లో తిరిగొచ్చి "కూచోండి !" కులాసాగా కుర్చీ చూపించాడు. ఆహా ! నేనంటే మానేజర్ కెంత గౌరవమో ! దర్జాగా కూచుని గార్డును గుర్రుగా చూశాడు.

"పో వెధవా !" అన్నట్టుగా "ఎందుకండీ మీరలా !" మర్యాదగా అడిగాడు మానేజర్.

"అబ్బే... ఏంలేదు సార్ !" తో ప్రారంభించి ఉపోద్ఘాతం చెప్పుకోబోయాడు.

"మీ కాంట్రాక్టులెలా నడుస్తున్నాయి" మాటల్లోకి దింపిన మానేజర్ మొహంలో రంగులు మారుతున్నాయి.

"బాగానే నడుస్తున్నాయి సార్ !" మాట పూర్తికాలేదింకా. ముగ్గురు పోలీసులు చాంబర్లోకొచ్చి మానేజర్‌కు సెల్యూట్ చేశారు.

"ఇతడే ... అతడు..." కామేశంను కళ్లతో చూపించాడతడు.

"ఇంక లేవండి. పదండి స్టేషన్‌కు" కామేశంను కొరకొర చూస్తూ అన్నాడో కానిస్టేబుల్. కామేశం అయోమయంలో పడిపోయాడు.

"అది కాదండీ ... !" ఇంకేదో చెప్పబోయాడు.

"అదంతా స్టేషన్‌లో చెప్పు ... పదా !" గర్జించాడు మరో కానిస్టేబుల్. నుదుటి చెమటను చేతి గుడ్డతో అద్దుకుంటూ లేచి చాంబర్ బయటి కొచ్చాడు. బ్యాంకును చురచుర చూస్తూ పోలీసు మధ్య నడుస్తూంటే పని పూర్తి చేసుకున్న రాజేశం బయటి కెళ్లి పోతున్నాడు.

(జలధి - 01-01-2009)